# చావు బ్రతుకుల మధ్య దూరం

ద్వివేదుల విశాలాక్షి

స్ప్రింగ్ డోరు తెరచుకొని బయటికి వచ్చేసరికి తన ఆత్రుత అంతా కళ్ళలో నిల్పుకొని గుమ్మంవైపే తదేక దీక్షతో చూస్తూ అతడు కన్పించేడు. ఎప్పుడూ అరవిచ్చిన మల్లెపువ్వులా అతి సుకుమారంగా, అందంగా కన్పించే మనిషి వడదెబ్బ తిన్నవాడిలా వాడిపోయి ఉన్నాడు. నా పెదవుల మధ్య కదలాడిన చిరునవ్వు అతని ఆరాటాన్ని అదిమిపెట్టి, ధైర్యాన్ని అందించిందేమో, ముఖంలో కొద్దిగా మెరుగు కన్పించింది.

నమ్రతగా చేతులు రెండూ జోడిస్తూ 'నమస్తే డాక్టర్' అన్నాడు. వాకిన అతని ముఖం వంకచూస్తూ ప్రతి నమస్కారం చేసేను.

'ఆమె కెలా వుంది?' ఏమాట విన వలసి వస్తుందో అన్న కంగారు అతని కంఠంలో పలికింది.

'మీరేం కంగారు పడకండి. అంతా సవ్యంగా పూర్తయింది. కొద్ది సేపట్లో తెలివి వస్తుంది. మరేవిధమయిన చికాకు లేదు' అన్నాను అతనికి ధైర్యం చెప్తూ.

'పిల్లా...'

'ఓ...సారీ, మీకింకా వార్త అందలేదా? మగపిల్లాడు. కంగ్రాట్యులేషన్స్ మిస్టర్ రావు.'

'థాంక్యూ డాక్టర్. పిల్లడు ఆరోగ్యంగా ఉన్నాడా?'

'చాలా ఆరోగ్యంగా వున్నాడు. వెళ్ళి చూడండి. మీరనుకొన్న లెక్కలు సరి కావు' అన్నాను.

'చాల సంతోషం డాక్టర్. మీదయ వల్ల...'

అతని మాట తడబడింది. తొట్రుపడుతూ నన్ను తప్పించుకొని గదిలోకి వెళ్ళేడు.

అతని తొట్రుపాటులో ఏదో చిత్రం, అతని కదలికలో ఏదో కథనం నా మనసులో మెదిలేయి. తెర తొలగిన నాటకంలా ఆరునెలల క్రిందటి సంఘటన కళ్ళకి కట్టింది. సౌదామిని అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికినట్లనిపించింది.

నాలుగు సంవత్సరాల క్రిందట సౌదామినిని నర్సింగ్ హోమ్‌లో మొదటిసారి చూసినప్పుడు ఆమె ఒక రోగి, నేను ఒక డాక్టరు; అంతకుమించి ఏ భావం నాలో కలుగలేదు. కాని ఏ నాటికీ లొంగుబాటుకిరాని ఆ రోగంతో ఆమె తరుచు నర్సింగ్ హోమ్‌కి రాకపోకలు సాగించడంతో మా ఇద్దరిమధ్య ఏదో ఒక విధమైన స్నేహం ఏర్పడింది.

సౌదామిని అంటే మెరుపుట. పసితనమునందే ఆ పిల్ల రూపురేఖలు గుర్తించి అంత అందమైన పేరు పెట్టిన ఆమె తలిదండ్రులపట్ల నాకు గౌరవ భావం కలిగింది. ఆషాఢ మేఘాలు అంచెలంచెలుగా ఆకాశంమీద పరుగులు పెడ్తున్నప్పుడు ఆ మేఘ మాలికల చాటు నుంచి తళుక్కున మెరిసే మెరుపు తీగెలా ఉండేది సౌదామిని. ఆమె భర్త పేరు మధుసూదనరావు. మామిడిచెట్టు, మాధవి లతలా ఉండేవారు దంపతులు.

శాస్త్రవిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందినా మందులకు, కత్తులకు పూర్తిగా లొంగని జబ్బులు ఇంకా ఉండడం ఆశ్చర్యకరమైన విషయమే. మా అనుభవాల్ని, విజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ ఒక్కొక్క రోగం, వైద్యశాస్త్రంపై విజయం సాధించినట్లు రోగి ప్రాణాల్ని అరగించడం చూస్తుంటే మానవుని శక్తికి అతీతమైనది ఇంకా చాలా మిగిలిపోయి ఉందని ఒప్పుకోక తప్పదు.

రాకపోకలవల్ల కలిగే అలసటని తప్పించడానికి ఆమెని నర్సింగ్ హోమ్‌లో జాయిన్ చేసేడు అతడు. స్పెషల్ వార్డుని అనుసరించే నా గది ఉండేది. పనిలేని వేళల్లో ఆమెతో మాట్లాడుకూ గడపడం నాకు ఒక అలవాటుగా మారింది. ఆ విధంగా మా స్నేహలత మారాకు తొడిగింది.

జీవితంలో ఏ చిన్న విషయాన్ని తేలికగా తీసుకోలేక పోయేది సౌదామిని. దినచర్యలో ఏ చిన్న లోపం కన్పించినా 'ఈ రోజు ఎందుకిలా అయింది డాక్టర్! నాకేదో భయంగా ఉంది' అనేది.

'ఒక్కొక్కసారి యంత్రాలు కూడా గతితప్పి నడుస్తాయి సౌదామినీ! మనం మనుష్యులం. హెచ్చుతగ్గులు, పొరపాట్లు రావడం సహజం. ప్రతిదానినీ అంతలా పట్టించుకో కూడదు' అనే దాన్ని.

నేనెంతగా చెప్పినా ఆమెకి ఆందోళన తగ్గేదికాదు 'జీవితంలో ముఖ్యమనుకొన్న విషయాల్లో నేను రాజీ పడలేను డాక్టర్. నాకు పరిపూర్ణమైన జీవితం కావాలి. ముఖం మొత్తేటంత ఆనందం కావాలి. అవి పొందలేనని తెలుసుకొన్ననాడు నిండు మనసుతో మృత్యువును ఆహ్వానిస్తాను. ఈ బ్రతుకు కంటే చావు నాకు శాంతిని సంపాదిస్తుంది' అనేది ఆవేశంగా.

ఒక్కొక్క సమయంలో ఆమె ఆలోచనలు తెలుసుకొని జాలిగా నవ్వేదాన్ని. వేరొక సమయంలో ఆ తీక్షణత చూసి భయపడేదాన్ని. ఈ కోమల పుష్పం రేకులన్నీ విచ్చుకొని పరవశించేవేళ ఏ కర్కశ హస్తమో త్రుంచి పోగులు పెట్టదు కదా అనుకొనేదాన్ని.


కాని, నా భయం నిర్హేతుకమనీ, ఆమె జీవితం వడ్డించిన విస్తరి లాంటిదనీ తెలుసుకొని భారం దింపుకొన్నాను. అనారోగ్యంతప్ప ఆమెని వేధించే ఇతర సమస్యలులేవు. దానిని సరిదిద్దడానికి ఎంత సొమ్మయినా వెచ్చించ కలిగే స్తోమత ఆమె భర్తకి ఉంది.

అతడు వేళ తప్పకుండా రోజూ

వచ్చేవాడు. పువ్వులూ, క ర్సా తెచ్చే వాడు. గంటకి పైగా ఆమె దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేవా డు. ధైర్య వచనాలతో ఆమెని ఉ తా హ పరచే వాడు. ఆమె భయాన్ని పారద్రోలి, ఆశలకి ప్రాణం పోసేవాడు

ఏమి అపురూప దాంప ్యం? ఎన్ని జన్మల అనురాగ బంధం ఇ . ఈస్థితిలో కూడా భర్త నుంచి ఇంత ప్రేమని అందు కోడానికి ఆమె ఏమి పూజలు చేసి పుట్టింది – అనుకొనేదాన్ని.

'మీరు అతన్ని ఎప్పుడైనా పరీక్షగా చూసేరా డాక్టర్. అతడు ఆమె పట్ల చూపుతున్న అనురాగంలో, ఆసక్తిలో ఏదో వెలితి ఉన్నట్లు అనిపిస్తుంది నాకు. కావాలని తెచ్చిపెట్టుకొన్న భావాల్ల



నాలిక చివర నుంచి వస్తున్న మాటల్లా ఉంటాయి' అంది నర్స్ పంకజం.

ఆమె ఆమాట విన్నాక రెండు, మూడు సార్లు అతడు ఆమె గదిలో ప్రవేశిస్తుండగా చూడటం తటస్థించింది

ప్రకాశవంతంగా వెలుగుతున్న దీపాన్ని ఒక్కసారిగా చిన్నది చేసినట్లు అంతవరకు అతని ముఖంమీద కన్పించే ఆనందం, ఉత్సాహం తొలగిపోయి, ఆ స్థానంలో జాలి, నిశ్చలత ప్రవేశించేవి. మనిషి నడకలో, మాటలో మార్పు వచ్చేది. పొంగి పొరలుతూంటే అతని జీవన వాహినికి అడ్డకట్టలా నిల్చేది ఆ గుమ్మం. క్షణకాలం క్రిందట వరండాలో నిలచిన మనిషికి, గదిలో కాలు పెట్టిన మనిషికి అసలు పోలికేలేనట్లు ఉండేది అతని తీరు.

ఏమిటీ వ్యక్తి! ఎందుకిలా ప్రవర్తిస్తాడు? అనుకొనేదాన్ని.

ఈ విషయాన్ని గ్రహించేక అతడి పట్ల అంతకు ముందులేని కుతూహలం నాలో జనించింది. మొదట్లో రెండు, మూడుసార్లు ఒక అందమైన అమ్మాయి పార్కులోనూ, సినిమాలోను అతనితో కన్పించింది. ఆ తరువాత ఆమె తరుచుగా అతనికారులో కన్పించేది-నర్సింగ్ హోమ్‌కి అతడు వచ్చినప్పుడు కూడా ఉండేది. కాని అతనితోపాటు లోపలికి వెళ్ళేదికాదు. అతడు తిరిగి వచ్చేవరకు కారులోనే కూర్చునేది. లేక ఎదురుగా ఉన్న షాపుల్లో ఇవీ అవీ చూస్తూ కాలం గడిపేది. గంట గడిచి అతడు బైటికి రాగానే కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ ఇద్దరూ వెళ్ళిపోయేవారు.

అందులో అంతరార్థం కొంత బోధపడినట్లే అనిపించేది. అయినా అసలు విషయం అంతు తేలకుండానే మిగిలిపోయేది.

దానికి అతన్ని తప్పు పట్టలేదు. లోకం తీరు అనుకొన్నాను. అతడు వయసులో ఉన్న మగాడు అందం, ఆస్తి అన్నీ ఉన్నాయి అన్నిటినిమించి అందాన్ని అభినందించడం, ఆనందాన్ని అనుభవించడం అన్న గుణాలు అతనిలో కాస్త హెచ్చుపాళ్ళలోనే ఉన్నట్లు సౌదామిని చెప్పినకొన్ని సంఘటనలనుబట్టి తెలుసుకొన్నాను.

అందానికి మెచ్చి ఏరికోరి చేసుకొన్న భార్య అదృష్టం వక్రించి దీర్ఘరోగిగా తయారయింది. ఆమె ఆ రోగం నుంచి ఎప్పటికి కోలుకుంటుందో, అసలు కోలుకుంటుందో లేదో కూడా చెప్పడం కష్టం. అటువంటి పరిస్థితిలో అందుబాటులో ఉన్న ఎవరో అందమైన అమ్మాయితో అతడు పరిచయం ఏర్పరచుకోడంలో తప్పు లేదని అనిపించింది.



ఈ అభిప్రాయానికి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఒకసారి అతడి కారు ముందునుంచి నేను ఇంకో వార్డుకి వెళ్ళడం జరిగింది అతడు నా వైపు చూసి "గుడ్ మార్నింగ్ డాక్టర్" అంటూ విష్ చేసి, ఆమెని పరిచయం చేసేడు. "మిస్ మంజుల... నా మరదలు" అంటూ.

"అంటే సౌదామిని..."

"చెల్లెలు" అన్నాడు అతడు నా మాటని పూర్తి చేస్తూ.

ఏదో వింతైన సమాచారం విన్నట్లు ఆమె వంక అలా చూస్తూ నిలచిపోయేను నేను. ఆశ్చర్యం నా ముఖంలో ప్రశ్నార్థకంగా నిలచి ఉండడం అతడు గమనించి ఉంటాడు.

"మంజుకి రోగులన్నా, రోగాలన్నా చాలా భయం. అందుకే బైట ఉండిపోతుంది" అన్నాడు.

"ఇది నిజమా?" అనుకొన్నాను.

అది నిజమే. ఆమె సౌదామిని చెల్లెలే. ఆ తరువాత, ఒకటి రెండుసార్లు లోపలికి వచ్చి అక్కని చూసి వెళ్ళింది. సౌదామినికి చెల్లెలంటే చాలా అభిమానం ఉన్నట్టే అనిపించింది. ఆ పిల్ల వారింటనే ఉండి చదువుకొంటున్నాదట.

ఒకొక్కసారి మమతానుబంధాలు ఏ ప్రాతిపదికమీద నెలకొంటాయో వాటికి మూలం ఏమిటో చెప్పడం కష్టం.

సౌదామిని గురించి నేను పడే ఆరాటానికి నర్సింగ్ హోమ్‌లో మిగిలిన డాక్టర్లంతా ఆశ్చర్యపోయేవారు. ముక్కుకి సూటిగా పనిచేసుకుపోతూ మిగిలిన విషయాలేమీ అంతగా పట్టించుకోవే అలవాటులేని నేను ఆ పిల్లపట్ల చూపించే ఆసక్తికి అర్థం చెప్పుకో లేక పోయేవారు. "పోనీ ఈ వయసులో ప్రేమ జనించిందేమో అనుకొనేందుకు మగవాడైనా కాకపోయె..." అంటూ చనువు ఉన్నవాళ్ళు పరిహాసం చేసేవారు.

ఆనాడు ఉదయం చీఫ్ సర్జన్ జగన్నాథ్ పెదవి విరుపులో నేను గుర్తించిన నిరాశ, నర్సు అందించిన ఛార్టులోని ఎగుడు దిగుడు గీతలు నన్నెంతో కలత పెట్టేయి.

"డాక్టర్. అంతేనా" అన్నాను, నెమ్మదిగా బైటికి వచ్చేక.

"మీరూ కేసుని చూసేరు ఏం చెప్పమన్నారు?" అన్నాడు.

"డాక్టర్ అలా జరగడానికి వీల్లేదు" నాకు తెలియకుండానే నా నోటిలోంచి బాధగా మాట బయటికి వచ్చింది.

ఉండేలు దెబ్బతిన్న పక్షి ఆర్తనాదంలా ఉంది ఆ మాట. అతడు క్షణకాలం నా వంక జాలిగా చూసేడు. ఇటువంటి మమతలు పెంచుకో కూడదు. మన చేతుల్లో ఉన్నదంతా మనం చేస్తున్నాము — అన్నట్లు ఉంది అతడి చూపు.

"అలా జరుగకుండా ఉండాలనే నేనూ కోరుకొంటున్నాను". అన్నాడు నెమ్మదిగా.

నా కన్నీరు అతనికంట పడకుండా ముఖం తిప్పుకొన్నాను. నా పరిస్థితి గ్రహించి అతడు మౌనంగా వెళ్ళిపోయేడు.

ఏమిటీ సంబంధం? ఎందుకీ అనుబంధం? నర్సింగ్ హోమ్‌కి వచ్చిన కేసులన్నీ బాగవుతున్నాయా? పసిపాపలు, బిడ్డల తల్లులు, వయసులో ఉన్నవాళ్ళు, ముసలివాళ్ళు.. ఎందరో వస్తుంటారు. కొందరు తిరి వెళ్తారు. కొందరు ఇక్కడే కన్ను మూస్తారు. చేయగలిగింది అంతా చేసేము అన్న తృప్తితో వారి చావులు మమ్మల్ని అంతగా బాధించవు. ట్రీట్‌మెంటు సరిగా జరక్క ఏదైనా కేసు నష్టపోతే మనసుకి బాధ కలుగుతుంది.

కాని, సౌదామిని విషయంలో అది మొదటినుండీ అణుమాత్రం లోపం కూడా

జరుగలేదు. అయినా మనసులో బాధ తప్పలేదు.

ఆలోచనలమధ్య తలుపుతట్టి లోపలికి వెళ్ళాలి అన్నధ్యాస లేకుండా హేండిల్ తిప్పి తలుపు తెరచేను. ఆరోజు అతడు రోజూకన్న ముందుగా వచ్చేడు. ఉదయం జగన్నాథ్ ఆ మాట చెప్పినప్పుడు అతడు ప్రక్కనే ఉన్నాడు. ఆమెతో తను గడపగలిగే కాలం ఇంక కొద్ది గంటలే అని గ్రహించి ఉంటాడు.

అతని ఒడిలో ఆమె తల ఉంది. ఆమె ముంగురులను ఆప్యాయంగా సవరిస్తూ అతడు మాట్లాడుతున్నాడు. కొద్ది గంటలలో ఎదురు పడబోయే మృత్యువు గురించికాదు తమకి శాశ్వత వియోగం కలిగించే బాధాకరమైన క్షణాల గురించి కాదు.

అందమైన జీవితం గురించి, ప్రపంచం అంతా పరుచుకొని ఉన్న సుందర ప్రకృతి గురించి; తామిద్దరమూ మిగిలిన జీవితంలో జంటగా చూడబోయే అందాల గురించి, ఆ బ్రతుకులో తీపి ... ఆ తీపి లోని ఆనందం...

అతని ఒడిలో ఆమె అరమూసిన కన్నులతో, ఆనందాన్నంతా నింపుకొన్న మనసుతో, శాంతంగా వింటున్నది. ఏనాడూలేని తేజస్సు ఆమె ముఖం మీద ప్రకాశిస్తున్నాది.

ఈ ఆఖరి దశలో జీవితంపట్ల ఇతడు ఎందుకింత మమకారాన్ని ఆమెకి కల్పించి పోస్తున్నాడు -- అనుకొన్నాను. కాని ఒక విధంగా అతని కోమల హృదయాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పోయేను. వేదనామయమైన మరణ సమయంలో కూడా ఆమె ఆనందంగా, శాంతిగా ఆఖరి శ్వాస తియ్యాలని కోరుకొంటున్న అతని అనురాగాన్ని అభినందించేను.

నా అడుగుల సవ్వడి విని అతడు మెల్లగా లేచేడు. తన ఒడిలో ఉన్న ఆమె తలని అతి సున్నితంగా తలగడపై ఉంచేడు. ఆ సమయంలో కొంచెం ముందుకి వంగి మెల్లగా ఆమె నుదుటిపై ముద్దు పెట్టుకొన్నట్లు అనిపించింది నాకు. అతడి కంటినుండి ఒకే ఒక కన్నీటి బిందువు రాలి ఆమె పెదవులపై పడింది.

ఆమె దెబ్బతిన్న లేడిపిల్లలా కళ్ళు విప్పి బెదురుతూ చూసింది. అతడు అప్పుడే విచ్చుకొంటున్న కలువపువ్వులా అందంగా ఆమె కళ్ళలోకి చూసి నవ్వేడు. ఆమె తృప్తిగా ఆ కన్నీటి బిందువును రుచి చూసింది.

"ఇంటికి వెళ్ళే ముందు ఒకసారి చూసి పోవాలని వచ్చేను. అంతకన్న ఏం లేదు" అన్నాను.

ఎండిన పువ్వులా ఉన్న తన చేతిని దుప్పటి క్రిందనుంచి అతి ప్రయత్నం మీద తీసి నా చేతిని అందుకొంది ఆమె.

నేనంటే మీకెంత అభిమానం డాక్టర్. ఈ అనుబంధం ఎన్ని జన్మలనాటిదో అన్నట్లుంది ఆమె చూపు.

మూడు సంవత్సరాలుగా అలవాటు



ద్వివేదుల విశాలాక్షి

పడిన ఆ కళ్ళు, బ్రతుకులో ఆత్మీయత అంటే ఏమిటో రుచి చూపించిన ఆ కళ్ళు మళ్ళీ చూసే అవకాశం ఉంటుందో, లేదో అన్నట్లు క్షణకాలం అలాగే చూస్తూ ఉండిపోయేను.

నర్సుతో తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పేను. ఆ రాత్రి డ్యూటీలో ఉండే డాక్టరుతో ఏదో చెప్పబోతుంటే నా పెదవులు తడబడ్డాయి.

"మీరేం కంగారు పడకండి డాక్టర్. అంతా నేను చూసుకుంటాను. పరిస్థితి ఏ పాటి విషమించినా మీకు కబురు చేస్తాను. ఈ పేషెంటు ప్రత్యేకత నాకు తెలుసు" అన్నాడు అతడు ధైర్యం చెప్తూ.

ఏ క్షణాన్నయినా ఫోను మ్రోగవచ్చు అన్నట్లే రాత్రంతా కంటిమీద నిద్రలేకుండా గడిపివేసేను. తెల్లవారి ఏడు కాకుండానే డ్రస్సువేసుకొని బయలుదేరేను. గది బయట వరండాలో రాత్రి డ్యూటీలో ఉన్న డాక్టరు కన్పించేడు.

"కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్" అన్నాడు నాచేతిని అందుకొంటూ.

"ఏమయింది? దేనికి?" అర్థంకాక అడిగేను.

"వెళ్ళి మీరే చూడండి" అంటూ తలుపుతీసి పట్టుకొన్నాడు.

మంచులో తడిసిన గడ్డిపువ్వులా ఉంది సౌదామిని. ఆ పువ్వుకి అందము, సౌరభము కొరతపడి ఉండవచ్చు. కాని జీవంమాత్రం అణుఅణువునా నిండుకొని ఉంది. దానికి నిదర్శనంగా ఒక్కొక్క రేకని విప్పుకొంటున్నాది.

ఇటువంటి వింతలు చాలా అరుదుగా జరుగుతాయి. జరిగిన సమయంలో అక్కడ ఉండి చూసినవారు తమ కళ్ళని తామే నమ్మలేని స్థితిలో క్షణకాలం ఉండిపోతారు. కాలం గడిచేక ఇంకెవరి నోటనో వింటే నమ్మబుద్ధికాదు.

సౌదామిని విషయంలో అటువంటి విచిత్రమే జరిగింది. అమాయకంగా, ప్రశాంతంగా నిద్రిస్తున్న ఆ పిల్లనోటిలో ఏ దేవతో దయతలచి ఒక అమృతపు చుక్క రాల్చి ఉండవచ్చు. ముందురోజు సాయంకాలం భర్త ఆమె కళ్ళముందు నిల్పిన అందమైన జీవితంలోని ఏ కాంతి రేఖో ఆమెని దారితప్పించి ఉండవచ్చు.

డాక్టర్లకి మతిపోయేలా, వైద్యశాస్త్రం ఆ వింత చూసి ఆశ్చర్యంతో తల మునకలు అయేలా, విపరీతమైన వేగంతో రోజురోజుకి కోలుకొంది సౌదామిని. మూడు నెలలు గడిచేసరికి ఇంక ఆమెని నర్సింగ్ హోమ్‌లో పెట్టి ఉంచవలసిన అవసరంలేదని డాక్టర్లంతా తీర్మానించేరు.

"మీరు నాకు ప్రాణంపోసేరు డాక్టర్. మీ ఋణం ఎలా తీర్చుకోను" అంది ఆమె కృతజ్ఞత నిండిన కళ్ళతో.

'తిరిగి అందుకొన్న ఈ జీవితంలో నువ్వు సుఖంగా, ఆనందంగా ఉండాలి. అంతకుమించి నాకేం కోరికా లేదు. నువ్వు ఇయ్యగలిగిన కానుకా లేదు" అన్నాను ఆమె చెక్కిలిని ఆప్యాయంగా నిమురుతూ.

ఆమె వెళ్ళిపోయేక, ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళిపోతే చిన్నబోయిన ఇల్లులా కన్పించింది నర్సింగ్ హోమ్. సౌదామిని జ్ఞాపకాలనుంచి తప్పుకోవాలని నాలుగు రోజులు సెలవు పెట్టేను. ఇంటిలో ఒంటరిగా కూర్చుని నాకు ఎల వేళలా శాంతి భిక్ష పెట్టే పుస్తకాలతో గడుపసాగేను. మూడో నాటి ఉదయం హాలులో కూర్చుని పేపరు చూస్తుంటే పంకజం పరుగుతో వచ్చింది.

'డాక్టర్... డాక్టర్... ఆమె తిరిగి వచ్చింది. మీరు వెంటనే రావాలి' అంది.

"ఎవరు పంకజం ... ఎవరు వచ్చేరు" అన్నాను చేతిలో పేపర్ని మడచి పక్కన పెడుతూ.

"ఆమే డాక్టర్... సౌదామిని".

"ఎవరు ? సౌదామిని ... ఎందుకొచ్చింది ?"

"జబ్బు తిరగపెట్టిందిం. ప్రమాదస్థితిలో ఉంది."

బట్టలైనా మార్చుకోకుండా అలాగే బయలుదేరేను. పంకజం చెప్పిన వార్త సరియైనదే. ఆమె స్థితి ఏమీ బాగా లేదు. ఎందుకలా అయిందో, అంతలో అంతమార్పు ఎలా వచ్చిందో ఎవరికీ అంతుబట్టలేదు. ఆమె కోలుకొన్నప్పటిలాగే అంతా వింతగా చూసేము. ఒంటిమీద తెలివిలేని స్థితిలో ఉన్న ఆమెని పరీక్షచేసి బైటికి వస్తుంటే "ఎందుకిలా అయింది డాక్టర్" అంటూ దీనంగా ప్రశ్నించేడు అతడు.

"నాకన్నా మీకే బాగా తెలిసి ఉండాలి" అన్నాను.

నా కంఠమె దువల్లనో కాస కరుకుగా విన్పించింది. అతని మీద కోపం వల్ల కాదనుకొంటాను. ఆమెపట్ల నాకు గల అభిమానంవల్ల అయి ఉండవచ్చు.

మూడురోజులనాడు ఆమెకి తెలివి వచ్చింది.

'డాక్టర్. మళ్ళా మీదగ్గరికి వచ్చేసేను' అంది చిన్నగా నవ్వుతూ.

'అట్టే మాట్లాడకు. విశ్రాంతి అవసరం' అన్నాను అంతకన్న ఏమనాలో తోచక.

ఆమె నామాట విన్పించుకోలేదు.

"డాక్టర్ చావు బ్రతుకులకి అర్థం ఏమిటి ? వాటిమధ్య దూరమెంత ?" అని ప్రశ్నించింది

నేనేదో మాట్లాడబోయేంతలో నన్ను వారిస్తూ తనే తిరిగి అందుకొంది 'ఒద్దు లెండి డాక్టర్. చెప్పబోకండి. మీరేదో హార్టుబీట్, పల్సురేట్ అంటూ మొదలు పెడతారు. మీ కెవర్నీ ప్రేమించలేదన్నారు. మీకు తెలియదు ఆ పదాలకి అర్థం, వాటి మధ్యదూరం" అంది సౌదామిని మెల్లిగా కళ్ళు మూస్తూ.

అందమైన ఆ కళ్ళు మళ్ళా విడలేదు. ఆమె అడిగిన ప్రశ్నకి ఆ వాడు అర్థం తెలియలేదు.

అతడు మంజులతని వివాహం చేసుకొన్నాడు. అన్నవార్త విని నేను ఆశ్చర్యపోలేదు కాని భార్యపట్ల అంత ప్రేమ కనపరచే వ్యక్తి ఆమె మరణించి నెల తిరుగకుండానే తిరిగి వివాహం చేసుకోవడం నాకెందుకో వెగటుగా అనిపించింది ప్రేమ... ప్రేమ అని మనం ఘనంగా చెప్పుకొనే రెండక్షరాల వెనుక దాగి ఉన్న పరమార్థం ఇంతేనా–అనుకొన్నాను. బ్రతికి ఉన్న మనుష్యులు మరణించిన ఆప్తుల్ని ఇంత శీఘ్రంగా మరచిపోగలరా అని ఆశ్చర్యపడ్డాను.

ఆరు నెలలు గడిచిపోయే సౌదామిని జ్ఞాపకాలను ప్రయత్నపూర్వకంగా మనసులోంచి నెట్టివేస్తున్న తరుణంలో అతడు తిరిగి వచ్చేడు. మొదటిసారి సౌదామినిని నర్సింగ్ హోమ్‌కి తీసుకు వచ్చినప్పటిలా అందంగా, హుందాగా ఉన్నాడు. ఆమె చావు అతనిలో ఏవిధమైనమార్పు తెచ్చినట్లు అనిపించలేదు.

ఈసారి అతనితో సౌదామినిలేదు: మంజులత ఉంది. అంతవరకే నాకు అతనిరాలో మార్పు కన్పించింది.

"మీ మీద నమ్మకతో మీదగ్గరికి తీసుకువచ్చేను" అన్నాడు.

డెలివరీ కేసు అతి ప్రయాసమీద తానుపు అయింది. తల్లిని పిల్లడిని కాపాడగలిగేనన్న సంతృప్తితో బయటికి వచ్చేను.

"ఏడవమాసంకూడా రాలేదు. ఏమవుతుందో అని కంగారు పడుతున్నాము" అంది మంజులత కేసు వ్రాసుకొంటున్నప్పుడు. కాని, పుట్టిన పిల్లడు నవ మాసములు తల్లిగర్భంలో పెరిగిన శిశువులా ఆరోగ్యంగా ఉన్నాడు. పెరుగుదలలో ఏపాటి కొరతలేదు. అమాటే అతనితో అన్నాను. 'పిల్లడు ఆరోగ్యంగా ఉన్నాడు. మీ లెక్కలు సరికావు' అని.

ఎందువల్లనో నామాట అతడిలో తడబాటు కలుగజేసింది. అడుగులు తొట్రుపడ్డాయి. నానుంచి ఇంకేమీ వినదల్చుకోనట్టు నన్ను తప్పించుకొని గదిలోకి వెళ్ళిపోయేడు.

అతని తడబాటులో ఏదో చిత్రం, అతని కదలికలో ఏదో కథనం నా మనసులో మెదిలేయి, సౌదామిని అడిగిన ప్రశ్నకి సమాధానం దొరికినట్లనిపించింది. ఆరోగ్యంగా ఇంటికి వెళ్ళిన ఆమె అంతలో అటువంటిస్థితిలో తిరిగి రావడంలో ఉన్న అర్థం బోధపడినట్లయింది.

నిండుమనసుతో జీవితాన్ని కాంక్షిస్తే, జీవించాలని కోరుకొంటే, అది బ్రతుకు, లేకపోతే ఆ బ్రతుకు చావుకి సమానం. వాటిమధ్య దూరం అతిస్వల్పం.

తన బ్రతుకు సాటి ఆడదాని జీవితానికి అన్యాయం చేస్తున్నదని సౌదామిని గ్రహించింది. భర్త ప్రాణంపోసిన జీవితంలోని ఎగుడు, దిగుడులను గుర్తించింది. బ్రతికి చచ్చేకంటే చచ్చి బతకడమే మంచిదనుకొంది. ఆమె తన చావులోనే బ్రతుకును చూసింది. చావు, బ్రతుకుల మధ్య దూరాన్ని అధిగమించింది.

"డాక్టర్. మిసెస్ రావుకి తెలివి వచ్చింది మిమ్మల్ని చూడాలంటున్నాది" అంటూ నర్స్ వచ్చింది ఆమె వెనుకనే గదిలోకి వెళ్ళేను. బాలెంతరాలి ప్రక్కనున్న తొట్టిలోని పాపని అతడు ఉత్సాహంగా చూస్తున్నాడు. "అంతా మీ పోలికే. ఆ సూదిగడ్డం, చిన్నముక్కు..." భర్తవంక అనురాగంగా చూస్తూ అంటున్నాది మంజులత.

☐☐☐